



పందేనికి సై

● కోళ్ల రకం, రంగును బట్టి రూ.2 లక్షల వరకు పలుకుతున్న ధర

8లో

కాళ్లకు కత్తికట్టి.. బరిలోకి దింపేందుకు పలుచోట్ల పందెంకోళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వీటికి శిక్షణ ఇప్పించి, జిల్లాకు తీసుకొచ్చారు. వీటి జాతి రకం.. రంగు.. డిమాండును బట్టి రూ.రెండు లక్షల వరకు కొన్నారు. చాటుమాటుగా తీసుకొచ్చిన ఈ కోళ్లకు పౌష్టికాహారం అందించి. బలంగా తీర్చిదిద్దుతున్నారు.

మద్యం తాగి.. వాహనాలు నడిపి

● తిరుమలలో ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్

- 8లో -

ఆరోగ్యమే ఆనందం

ఈ కొత్త సంవత్సరంలో జీవితం ఆనందమయంగా ఉండాలంటే ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. మన గురించి.. మనం కాసింత శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడే 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అవుతుంది. దీనికి ఏం చేయాలనేది 8లో తెలుసుకుందాం.



ఈఎస్ఐ ఆస్పత్రికి 100 పడకల హోదా

● రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం

తిరుపతి(వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా హోదా పెంచుతూ రాష్ట్ర కేబినెట్‌లో గురువారం ఆమోదం తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చి కార్మికులకు వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో 2018లో కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మించారు. అన్ని వసతులతో ఈఎస్ఐ ఆస్పత్రి రూపుదిద్దుకుంది. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 100 పడకల ఆస్పత్రి కలగానే మిగిలిపోయింది. దీంతో ఆస్పత్రిలో వైద్య సదుపాయాలున్నా 100 పడకల హోదాకు నోచుకోక సిబ్బంది, మందుల కొరతతో కార్మికులకు అరకొర వైద్యం అందుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన రాష్ట్ర కేబినేట్ సమావేశంలో ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచుతూ ఆమోదం తెలపడంతో రాయలసీమలోని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రికి 100 పడకల హోదా పెరగడంతో ఆస్పత్రిలో సిబ్బంది, మందుల సంఖ్య పెరిగి మరింత స్థాయిలో కార్మికులకు వైద్య సేవలు అందున్నాయి. ఆస్పత్రికి 100 పడకల హోదా కల్పించేందుకు ఎంతగానో కృషి చేసిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌కు, రాష్ట్ర డైరెక్టర్ ఆంజినేయులకు ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్యాంబాబు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.









చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

యాజమాన్య నిర్లక్ష్యమే కారణమా?

● స్టీల్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదంలో ఒకరి మృతి

● చికిత్స పొందుతున్న మరో ఐదుగురు ● ఘటనపై ఆరా తీసిన మంత్రి సుభాష్

పెళ్లకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య నిర్లక్ష్యమే స్టీల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదానికి కారణమన్న విమర్శలు తలెత్తుతున్నాయి. అక్కడి పరిణామాలను పరిశీలించాక పలువురు ఇదే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఫర్నేస్ బాయిలర్ ఒత్తిడికి గురై పేలడంతో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ అగ్ని ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. వీరిని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో గురువారం చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సిపాయిలాల్ (30) మృతిచెందారు. మిగతా ఐదుగురు చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే. కాగా, ఫర్నేస్ బాయిలర్‌లో సామర్థ్యానికి మించి ఒత్తిడి తెచ్చినట్లుగా చెబుతున్నారు. దాంతో పాటు బాయిలర్ ఫర్నేస్ కాయిల్‌లో నుంచి ఆయిల్ లీకవుతున్నా పట్టించుకోలేదని తెలిసింది. ఇలా నిర్లక్ష్యంగా ఉండటం వల్లే మంటలు చెలరేగి బాయిలర్ పేలిపోవడానికి కారణమైందని సమాచారం. ఈ ప్రమాద సమయంలో 12 మంది వరకు అక్కడ విధుల్లో ఉన్నట్లు తెలిసింది. ప్రమాదంపై అధికారులు పూర్తి సమాచారం రాబట్టేందుకు ఇక్కడి సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు.

ప్రమాదాన్ని చిన్నదిగా చూపే యత్నం!

గతంలోనూ ఇక్కడ పలు ప్రమాదాలు జరిగినా బయటకు పొక్కనివ్వలేదని స్థానికులు అంటున్నారు. కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో బయట పడలేదు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరిగినా అది చాలా చిన్న ప్రమాదమే అన్నట్లుగా చిత్రించేందుకు యాజమాన్యం ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. సహాయక చర్యల్లో పాలు పంచుకునేందుకు చుట్టుపక్కల స్థానికులు ముందుకొచ్చినా లోపలకు అనుమతించకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. భద్రతా చర్యల్లోనూ నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి.

ఇలాంటి ఘటనలు పునరావృతం కానివ్వద్దు

● నిర్లక్ష్యం వహిస్తే యాజమాన్యంపై కఠిన చర్యలు

● ఎమ్మెల్యే విజయశ్రీ హెచ్చరిక

ఇలాంటి ప్రమాదకర ఘటనలు మళ్లీ జరగకుండా యాజమాన్యం పటిష్ట చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్పష్టంచేశారు. పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీని గురువారం ఉదయం ఆర్డీవో కిరణ్మయితో కలసి ఆమె సందర్శించారు. పేలిన బాయిలర్ ప్రాంతాన్ని పరిశీలించారు. దానికి సంబంధించిన సీసీ టీవీ పుటేజీలను చూశారు. అనంతరం యాజమాన్యంతో సమావేశమై బాయిలర్ పేలుడుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, పార్థసారధి పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, వీఆర్వోలు రమేష్, సుమతి తదితరులున్నారు.



సీసీ కెమెరాల పుటేజీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించండి

● కలెక్టర్‌కు మంత్రి వాసంశెట్టి ఆదేశం

'స్టీల్ ఫ్యాక్టరీలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోండి. వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమగ్ర నివేదిక ఇవ్వండి' అని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను రాష్ట్ర కార్మికమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అండగా నిలవాలన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం

మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారాన్ని యాజమాన్యం అందిస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. చికిత్స పొందుతున్న ఐదుగురు కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారంతో పాటు వైద్యఖర్చులను యాజమాన్యం భరించేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

వేరుశనగ రైతుల 'పుట్టి' ముంచుతున్న దళారులు

● సిండికేట్ కావడంతో పడిపోయిన ధరలు



శ్రీనివాసాపురంలో ఆరబెట్టిన వేరుశనగ కాయలు

● ఐదు రోజుల ముందు వరకు పుట్టి వేరుశనగ(11.5 బస్తాలు) కాయల ధర రూ.35 వేల నుంచి రూ.40 వేలు.

● ఆ తర్వాత ధరలు రూ.29.5 వేలకు పడిపోయాయి.

ఇలా ధరలు తగ్గిపోవడానికి.. ఈ ఐదు రోజుల్లో జరిగిన పరిణామాలేంటంటే.. రైతులు వేరుశనగను ఒబ్బిడి చేయడమే. అంటే కాయలు కళ్లానికి చేరేటప్పటికి ధరలు తగ్గిపోయాయి. దళారులు సిండికేట్ అయి.. ఇలా తమ 'పుట్టి' ముంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సముద్రతీర గ్రామాల్లోని సిలికా భూముల్లో అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో తీరప్రాంత రైతులు వేరుశనగలో కొత్తరకమైన ట్యాగ్24 (గుజరాత్ సీడ్) సాగులో పెట్టారు. వరుస నష్టాలతో దెబ్బతింటూ వచ్చిన రైతులు.. ఈ రకంతోనైనా అధిక దిగుబడి సాధించి అప్పుల నుంచి బయటపడొచ్చని భావించారు. ఇలా.. కోట మండలం కర్లపూడి, సిద్ధవరం, వావిళ్లదొరువు, గోవిందపల్లి, కొత్తపట్నం, శ్రీనివాసస్రతం, యమదిన్నెపాళెం, గున్నంపడియా.. చిల్లకూరు మండలంలోని కనుపూరు, బల్లవోలు, మన్నేగుంట తదితర తీర గ్రామాల్లోని రైతులు సిలికా భూముల్లో ట్యాగ్24 రకం వేరుశనగ సాగు చేశారు. మూడు నెలల కాలవ్యవధిలో చేతికి వచ్చే ఈ పంటపై రైతులు ఆశలు పెట్టారు. ఎకరా రెండు నుంచి 4 పుట్ల వరకు దిగుబడి రావాల్సి ఉంది. ఎకరాకు రూ.40వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. కానీ, పంట సరిగా రాలేదు. అయితే, మొదట్లో ఈ రకం కాయలు పుట్టి రూ.35వేల నుంచి రూ.40వేల వరకు ధర పలికింది. దీంతో రైతులు దిగుబడి తగ్గినా రేటు కలిసొస్తుందని భావించారు. ఐదు రోజులుగా వేరుశనగ పెరికి.. కాయలు ఆరబెట్టారు. అదే సమయంలో ధర కూడా పుట్టి 29,500 రూపాయలకు పడిపోయింది. తగ్గిన దిగుబడి.. ధరలతో దిగాలుపడ్డ సముద్ర తీర ప్రాంత రైతులు చేసేదిలేక దళారులు అడిగిన ధరలకు అమ్ముకుంటున్నారు.

- కోట, ఆంధ్రజ్యోతి

'సదరం' సర్టిఫికెట్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

● అధికార యంత్రాంగానికి కలెక్టర్ హెచ్చరిక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయనే నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి రీవెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌తో పాటు పలు అంశాలపై విజయవాడ నుంచి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. సదరం ద్వారా జారీ సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించడానికి ప్రత్యేకంగా వైద్యాధికారులను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. నకిలీ ధృవీకరణ పత్రాలు, టాంపరింగ్ వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లపై పింఛన్లు పొందుతున్న వారిలో మొదటి దశలో మంచానికే పరిమితమైన వారి ఇళ్లను ప్రత్యేక వైద్యులు, డిజిటల్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ బృందం సందర్శించి వివరాలు నమోదు చేస్తారన్నారు. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ చాలా పకడ్బందీగా చేపట్టాల్సి ఉటుందని ఎలాంటి అక్రమాలకు చోటు ఉండరాదని తెలిపారు. కొత్తగా బోగస్ సదరం సర్టిఫికెట్లు ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు పీడీ శోభన్‌బాబు, అధికారులు జుబేదా, బాలాజీనాయక్, అనందమూర్తి, రవిప్రభు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఎర్రచందనం పట్టివేత



తిరుమల,జనవరి 2(ఆంధ్రజ్యోతి): అత్యంత నిఘా కలిగిన తిరుమల నుంచి ఎర్రచందనం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఫారెస్ట్ విభాగం గురువారం అదుపులోకి తీసుకుంది.ముందస్తు సమాచారంతో గురువారం సాయంత్రం ఫారెస్ట్ విభాగం అధికారులు, సిబ్బంది శిలాతోరణం చెక్‌పోస్ట్ వద్ద నిఘా పెట్టారు. సాయంత్రం 6 గంటల సమయంలో అడవి నుంచి శిలాతోరణం మార్గంలో వస్తున్న ఓ కారును తనిఖీ చేశారు. చిన్నపాటి ఎర్రచందనం దుంగలు కనిపించాయి. విజిలెన్స్ సిబ్బంది సహకారంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ సహా ఎర్రచందనాన్ని తిరుపతికి తరలించారు. పట్టుబడిన 20 ఎర్రచందనం దుంగలు (536 కిలోలు) సుమారు రూ.21లక్షలు ఉండొచ్చని అంచనా. కాగా, తిరుమల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా కొన్నేళ్లుగా తగ్గినట్టు అనిపించినా, ఇటీవల మళ్లీ మొదలైంది.

టీడీపీ కార్యదర్శిపై వైసీపీ దాడి



దాడిలో గాయపడ్డ పురుషోత్తం, రాజేష్‌లతో రోడ్డుపై ధర్నా

జాతీయ రహదారిపై బైఠాయించిన తెలుగు తమ్ముళ్లు

నగరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి):నగరి మండలం తడుకుపేట పంచాయతీలో గురువారం రాత్రి వైసీపీ శ్రేణులు జరిపిన దాడుల్లో టీడీపీ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడితో పాటు రాజేష్ అనే కార్యకర్త గాయపడడం ఉద్రిక్తతకు దారితీసింది.తడుకుపేట పంచాయతీ పరిధిలోని తడుకులో,ఎస్వీపురంలో ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులు చేపట్టేందుకు రాజేష్ చదును చేయించారు. గ్రావెల్‌కోసం మాట్లాడి వచ్చారు. ఈ విషయం తెలిసిన వైసీపీ నాయకులు రోడ్డెలా వేస్తారో చూస్తామంటూ రెండు రోజుల క్రితం రాజేష్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన పురుషోత్తం నాయుడు రాజేష్‌ను తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు.ఈ నేపథ్యంలో గురువారం వైసీపీకి చెందిన సత్యను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి సాయంత్రం పంపేశారు.గురువారం రాత్రి 8గంటల సమయంలో పురుషోత్తంనాయుడు, రాజేష్ నగరికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.ఈ విషయం తెలిసిన టీడీపీ శ్రేణులు గాయాలపాలైన పురుషోత్తం, రాజేష్‌లను తడుకుపేట వద్ద జాతీయ రహదారిపై పడుకోబెట్టి ధర్నాకు దిగారు. గంటన్నరకు పైగా వీరి ఆందోళన కొనసాగింది.నగరి,నింద్ర,విజయపురం మండలాలకు చెందిన పోలీసులు కూడా తడుకుపేటకు చేరుకున్నారు.10గంటలకు సీఐ మహేశ్వర్ ఆందోళనకారులతో చర్చించారు.నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు.గాయపడిన పురుషోత్తం, రాజేష్‌లను నగరి ఆస్పత్రికి తరలించారు.



తలపై గాయంతో రాజేష్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పురుషోత్తం

రెండు రైళ్ల రద్దు

తిరుపతి(ఆటోనగర్), జనవరి2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- జమ్ముతావి మధ్య నడుస్తున్న రైళ్ల(22705- 22706)ను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్తన్ రైల్వేలో జాతీయ రైలు మార్గం మరమ్మతుల కారణంగా ఈ నెల 7, 19 తేదీల్లో ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర


మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీవో రుక్మాంగద

రామచంద్రాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలకపాత్ర అని సమగ్ర శిక్ష ఏపీవో రుక్మాంగద అన్నారు. స్థానిక కమ్మకండ్రిగ జడ్పీ ఉన్నతపాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్నభోజన నాణ్యతను తల్లిదండ్రుల కమిటీ విధిగా పర్యవేక్షించాలన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రణాళిక, సమకాలీన సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు, ఆర్పీలు హరికుమార్, పీవీఎస్ఎన్ రాజు, గోవిందరాజులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల వీఆర్వోల కార్యవర్గం

భాకరాపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో వీఆర్వోల సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా కె.మునిరత్నం, గౌరవ సలహాదారుగా కె.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా కె.రాధమ్మ, కార్యదర్శిగా మస్తాన్ బాబు, సభ్యులుగా చలపతి, మారుతి, సూర్యమోహన్ రెడ్డి, జయరాంరెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం వారు తమ కార్యవర్గ వివరాలను తహసీల్దారు జనర్దాన్‌రాజుకు అందజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడికట్లపూజ


పడికట్ల పూజలో శాప్‌చైర్మన్ రవినాయుడు

తిరుపతి రూరల్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయల్‌నగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు నేతృత్వంలో పడికట్ల పూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్న, ప్రసాదాలను పంపిణీచేశారు. బిరుదాల హనుమంతరెడ్డి, ఎంఎస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ

తిరుపతిరూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సర క్యాలెండరును గురువారం చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదవిద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు అందించి పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి దివంగత వైఎస్సార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. విద్యార్థి విభాగ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భూపాల్, రాజశేఖర్‌రెడ్డి, రవి, ఓంప్రకాశ్‌రెడ్డి, ఓబులేషు, హరినాథరెడ్డి, ముబారక్, మధుసూదన్, రఫీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో అంగన్వాడీ భవనం నిర్మించండి


సర్పంచ్, కార్యదర్శులకు వినతి పత్రమిస్తున్న ప్రజలు

తిరుపతి రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లె హరిజనవాడలో అంగన్వాడీ భవనాన్ని, శ్మశానవాటికకు ప్రహరీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. గురువారం సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షనత రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. టీడీపీనేత అయ్యప్పతో పలువురు కలసి సర్పంచ్, కార్యదర్శిలకు వినతిపత్రం సమర్పించారు. గతంలో కమ్యూనిటీహాలులోలో అంగన్వాడీని నిర్వహించేవారన్నారు. ఇప్పుడు దాన్ని కూడా మూసేశారన్నారు. చెంచువారికాలనీకి ఎదురుగా స్థిరనివాసాలు ఏర్పరచుకున్న వారు తమకు ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. చెత్తరహిత గ్రామంగా చేసేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సరస్వతమ్మ, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి, వీఆర్వో రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అర్జీలకు త్వరలో పరిష్కారం


అర్జీలు తీసుకుంటున్న తహశీల్దార్ సంతోష్‌సాయి

పాకాల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అచ్చమ్మ అగ్రహారంలో గురువారం తహశీల్దార్ సంతోష్‌సాయి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో హౌసింగ్ 2, సర్వేకు సంబంధించి 8, మ్యూటేషన్ దిద్దుబాటు 2, మ్యూటేషన్ కోసం 8, సర్వే నెంబర్లు 7, నోషనల్ ఖాతాకు సంబంధించి 5 అర్జీలు అందాయి. వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి అందిన అర్జీలను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని తహశీల్దార్ చెప్పారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్, సర్పంచ్ చెంగల్రాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: నెత్తకుప్పం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. 17 వినతులు అందాయి.ఇందులో ఏడు రెవెన్యూకు సంబంధించినవి. వీటన్నింటిని పరిష్కరిస్తామని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జేడీ జగన్, ఆర్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దొంగ పత్రాలతో మా భూమి కబ్జా చేశారు

● న్యాయం చేయాలని వృద్ధురాలి వేడుకోలు


మీడియాతో మాట్లాడుతున్న గిరిజ

తిరుపతి (ఉపాధ్యాయులు), జనవరి 2(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి తమకు జీవనాధారమైన భూమిని కబ్జా చేశారని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని స్థానిక గిరిపురానికి చెందిన పి.గిరిజ వేడుకున్నారు. గురువారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ తన తండ్రి ఏలుమలై మాజీ సైనికోద్యోగి కావడంతో 1948లో తిరుపతి అర్బన్ మండలం తిమ్మినాయుడుపాళెం గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నం.21/2లో 3.36 సెంట్ల భూమిని అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి తాము ఆ భూమిని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని కబ్జా చేశారని వెల్లడించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందని, రెవెన్యూ అధికారులు కూడా ఆధారాలు లేవని చెబుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. భూమిని ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బాధితురాలి సోదరుడు విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మూడో రోజుకు 'కానిస్టేబుల్' ఎంపిక ప్రక్రియ


లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

చిత్తూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మూడోరోజు కూడా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో కొనసాగింది. ఉమ్మడి జిల్లా నుంచి గురువారం 599 మంది అభ్యర్థులకు గాను 294 మంది హాజరవగా.. 163 మంది అర్హత సాధించారు. ఉదయం 394 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా ఎత్తు, ఛాతీ కొలతలు తీయగా 163 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా 1600 మీటర్ల పరుగుపందెం, 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఈ మూడ్రోజులపాటు 1799 మంది అభ్యర్థులకు గాను 1173 మంది హాజరవగా, 477 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ జరిగింది. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, టౌన్ డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు మహిళా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

శుక్రవారం ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నారు. 495 మంది హాజరు కావాల్సి ఉంది. వీరికోసం ఒక మహిళా డీఎస్పీ, ఓ మహిళా సీఐ, ఐదుగురు మహిళా ఎస్ఐలు, తొమ్మిది మంది మహిళా ఏఎస్ఐలు, 35 మంది మహిళా కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది మహిళా హోంగార్డులను నియమించారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేద్దామని పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యా యులు, పీడీలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వ్యక్తిగత, ఉపాధ్యాయ, గ్రూప్ విభాగాల కింద ప్రతి మం డలం ఉంచి మూడు ఎగ్జిబిట్లు జిల్లా ప్రద ర్శనలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ముందు గా కమిటీలు వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు.

చంద్రగిరి

ఇరువర్గాల ఘర్షణపై కేసు

పాకాల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పొగతోటకు చెందిన నవీన్, సురేష్, చంద్రశేఖర్, బాలుతో సుదర్శన్‌లు మంగళవారం రాత్రి తన భర్త పవన్ పవన్ తలపై రాడ్‌తో కొట్టారని పార్కువీధికి చెందిన ఐశ్వర్య ఫిర్యాదు చేసింది. పవనే తమపై దాడి చేశాడని నవీన్ ఫిర్యాదు చేశాడు. బుధవారం ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

భాకరాపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో శుక్రవారం జరగనున్న జాబ్ మేళాను మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ కోరారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో జరుగుతున్న ఈమేళాలో పలు కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. .

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్)/తిరుచానూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో 132 కేవీ విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. నాణ్యమైన సేవలు అందించేందుకు రేణిగుంట 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి తిరుపతి 132 సబ్‌స్టేషన్ వరకు తీగలు మరమ్మతు చేస్తున్నామన్నారు. తిరుచానూరు, తండ్లం, బ్రాహ్మణపట్టు, అమ్మా ఆగ్రోఫామ్ 11కేవీ విద్యుత్ ఫీడర్లు పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. బ్రాహ్మణపట్టు, పాడిపేట హౌసింగ్ కాలనీ, శేషాద్రినగర్, పాతూరు, విప్పమానుపట్టెడ, పలు దళితవాడల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎఫ్ఆర్టీఐ నగర మహిళా అధ్యక్షురాలిగా సూర్యకుమారి


గుర్తింపు కార్డు స్వీకరిస్తున్న సూర్యకుమారి

తిరుపతి అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఫోరమ్ ఫర్ ఆర్టీఐ శాఖ తిరుపతి పట్టణ మహిళా అధ్యక్షురాలిగా జి.సూర్యకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో గురువారం ఎఫ్ఆర్టీఐ జాతీయ సంయుక్త కార్యదర్శి జె.అజయ్‌ప్రసన్న నుంచి ఆమె గుర్తింపు కార్డు స్వీకరించారు. తనపై నమ్మకముంచి ఈ పదవి అప్పగించిన జాతీయ అధ్యక్షుడు పి.చంద్రమోహన్, రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.రేవతిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సామాన్యుల సమస్యలు తీర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

నాగాలమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నాగాలమ్మ ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. గురువారంరాత్రి చంద్రగిరి, రాయలపురం పంచాయతీ ప్రజలు సమావేశం నిర్వహించి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా స్థలదాత సునంద రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా విజయసాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, ఒంటె శివశంకర్‌రెడ్డి, సభ్యులుగా పాకాల సతీష్‌రెడ్డి, విరుపాక్షి శంకర్‌రెడ్డి, మొక్కల రాజారెడ్డి, శ్రీనివాసులు, నాగార్జున, రామ్మూర్తి, చంద్రలను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు.

యాజమాన్య కమిటీలతో పాఠశాలల బలోపేతం

ఎర్రావారిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కానున్నాయని జిల్లా ఉప విద్యాశాఖాధికారి బాలజీ అన్నారు. మండల కేంద్రంలో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, వైస్‌ఛైర్మన్లు,ప్రధానోపాధ్యాయులకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతుల పరిశీలకులుగా బాలజీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు తమ బాధ్యతలను నిర్వర్తించాన్నారు. బోధన వాతావరణం ఉండేల్లా యాజమాన్య కమిటీ బాధ్యత వహించాలన్నారు. కమిటీ పాత్రపై ఛైర్మన్‌లకు శిక్షణ ఇచ్చారు. ఎండీవోలు వెంకటసుబ్రమణ్యం, సతీస్‌కుమార్,హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి చేరువలోనే ఉన్నా మట్టి రోడ్లే దిక్కు

● సకాలంలో అందని పంచాయతీ తీర్మానం

● నిధుల మంజూరులో జాప్యం


గుంతలమయంగా తయారైన మట్టిరోడ్డు

తిరుపతి రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పలుకాలనీల్లో ఇప్పటికీ సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తిరుపతి నగరానికి సమీసంలోనే ఉన్న ఎన్ఆర్ లేఅవుట్, తెలుగుతల్లి ఆశ్రమం, రామచంద్రయ్య కాలనీ, నాగరత్నమ్మకాలనీ, స్వర్ణలేఅవుట్, 250కాలనీ, విద్యుత్‌నగర్, చెంచులక్ష్మీకాలనీ, కొండోల కాలనీల్లో ఇప్పటికీ మట్టిరోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లు బురదమయమతుతున్నాయి. గుంతల్లో నీరుచేరి వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక రూరల్ మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవ తీసుకుంటున్నారు. ఈక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. తొలిదశలో మండలంలోని 24సచివాలయాల పరిధిలో 45పనులు (సీసీ రోడ్లు) చేపట్టేందుకు దాదాపు రూ.4కోట్లు మం జూరు చేయించారు. వేదాంతపురం గ్రామస్తుల వినతిమేరకు ఆర్‌సీపురానికి వెళ్లే ప్రధాన రహదారిలో గోపీకృష్ణ ఆయిల్‌మిల్ నుంచి పలుకాలనీల మీదుగా బైపాస్ వరకు రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేసేందునకు ప్రయత్నాలు జరిగాయి. అయితే పంచాయతీ తీర్మానం చేయడంలో అలసత్వం కారణంగా నిధులు మంజూరు కాలేదని గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పంచాయతీ తీర్మానం చేసి పంపితే తొలిదశలోనే నిధులను మంజూరయ్యేవంటున్నారు. ఎంపీడీవో రామచంద్రని వివరణ కోరగా.. పంచాయతీ పనులపై తీర్మాన కాపీ అందలేదన్నారు. దీంతో వేరే పంచాయతీకి నిధులను మంజూరు చేశామని పేర్కొన్నారు.

గ్రామసభలకు సమస్యల హోరు


రణధీరపురం కార్యదర్శి నాగరాజులకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ మహిళలు

తిరుపతి అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం పరిధిలోని ఐదు పంచాయతీల్లో గురువారం నిర్వహించిన గ్రామసభలకు ప్రజలు సమస్యలు హోరెత్తించారు. సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళంక్వార్టర్స్, తిరుమలనగర్, శెట్టిపల్లి పంచాయతీల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభలు నిర్వహించారు. మంగళం 2 గ్రామ పంచాయతీలో జయలక్ష్మమ్మ కాలనీకి చెందిన 306, 307 నంబరు ఇళ్లను తమ ప్రమేయం లేకుండా పేర్లు మార్చి పనులు మంజూరు చేశారని సొంతదారులు రాజేశ్వరమ్మ దంపతులు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు కల్పించుకుని ఆధారాల్లేకుండా ఇంటిపన్నులు ఎలా కట్టించుకుంటారని నిలదీశారు. రణధీరపురంలో రెండు నెలల క్రితం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా వీధుల్లో డ్రైనేజీ కాలువలు కట్టలేదని, ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉంటోందని స్థానికులు మండిపడ్డారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఉన్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. తిరుమలనగర్‌లో పందుల బెడద ఎక్కువగా ఉందని,రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉన్నాయని, తాగునీరు సరిగా రావడం లేదని తెలిపారు. శెట్టిపల్లి మిట్టగాంధీపురంలో శ్మశానంలో బోరు, రోడ్డు వేయాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, గుంతలు తేలిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని విన్నవించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సర్పంచ్ జె.వీరమ్మ, కార్యదర్శి మోహన్, మంగళం -2 సర్పంచ్ వరలక్ష్మి, కార్యదర్శి లావణ్య, సప్తగిరికాలనీ సర్పంచ్ కె.ఎస్.నాగభూషణమ్మ, కార్యదర్శి జయశంకర్, రణధీరపురం సర్పంచ్ పి.లీలావతి, కార్యదర్శి కె.నాగరాజు, తిరుమలనగర్ సర్పంచ్ ఎం.వక్కుల, కార్యదర్శి పి.స్వాతిశ్రీ పాల్గొన్నారు.

ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్‌గా వంశీధర్‌కు పదోన్నతి



తిరుపతి(నేరవిభాగం), జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్‌కు అదనపు కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. 2012 బ్యాచ్‌కు చెందిన వంశీధర్ తొలుత అసిస్టెంట్ కమిషనర్‌గా శాఖలో అడుగుపెట్టారు. 2022లో జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. 2023 జూలై వరకు విశాఖలో పనిచేశారు. అక్కడి నుంచి తిరుపతికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా పదోన్నతి లభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి సన్నిధి తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తన పరిధిలోని తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో పన్ను ఎగవేతదారులను గుర్తించి, రూ.150 కోట్ల వరకు రికవరీ చేశామని తెలిపారు. ఎక్సలెన్సు అవార్డు కూడా అందుకున్నానన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామిభక్తులకు దర్శనమిచ్చారు. శ్రవణ నక్షత్రం కావడంతో సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠించి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

బర్దన్ ఆశయాలను కొనసాగిస్తాం


బర్దన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం నిజాయితీగా పోరాటాలు చేసిన సీపీఐ నేత ఏబీ బర్దన్ ఆశయాలను కొనసాగించేందుకు కార్యకర్తలు, యువకులు ముందుకు రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గురువారం బర్దన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రామానాయుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం శ్రమించిన నాయకుడిగా బర్దన్ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నాయకులు పి.మురళి, విశ్వనాథ్, రాధాకృష్ణ, బి.చలపతి, ఎన్.డి.రవి, కేవై.రాజా, లక్ష్మయ్య, ఎన్.శివ, రత్నమ్మ, మంజుల ఉన్నారు.

ఏపీటీడీసీ నూతన ప్యాకేజీ టూర్లు

6న టెండర్లు ఓపెన్

తిరుపతి అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తిరుపతి డివిజన్ ఆధ్వర్యంలో నూతన ప్యాకేజీ టూర్లను త్వరలో ప్రవేశపెట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆహ్వానించిన టెండర్లను ఈనెల 6వ తేదీన ఓపెన్ చేయనున్నారు. శ్రీవారి దర్శన టికెట్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో పర్యాటక విభాగానికి సంబంధించి గతనెల నవంబర్ ఒకటో తేదీ నుంచి రూ.300టికెట్ల కోటాను రద్దు చేస్తూ టీటీడీ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టూర్ ప్యాకేజీలు రద్దు కావడంతో పర్యాటక శాఖకు గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు నూతన టూర్ ప్యాకేజీలకు ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి నివేదించారు. రెండు ప్యాకేజీలకు అనుమతులు రావడంతో టెండర్లను ఆహ్వానించారు. సోమవారం ఓపెన్ చేయనున్నారు. మరో రెండు ప్యాకేజీలకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.

అనుమతి లభించినవి

● హైటెక్ ఏసీ బస్సులో తిరుపతి, మహానంది, శ్రీశైలం సందర్శించి తిరుపతికి చేరుకునేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు.

● ఓల్వో ఏసీ బస్సులో తిరుపతి, కన్యాకుమారి, తిరుచ్చి, మధురై, రామేశ్వరం, తంజావూరు ఆలయాలను సందర్శించి, తిరుపతికి చేరుకునేలా టూర్‌ను ఖరారు చేశారు. రేట్లు ఖరారు చేయాల్సి ఉంది.

అనుమతి రావాల్సినవి

● ఓల్వో ఏసీ బస్సులో తిరుపతి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్, శ్రీకాళహస్తి

● ఓల్వో ఏసీ బస్సులో తిరుపతి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్, అరుణాచలం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన భిక్షగాడు- శివజయంతి

తిరుపతి (నేర విభాగం) జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు తిరుపతి కొర్లగుంటకు చెందిన పవన్ కుమార్ భార్య శివజయంతితో కలిసి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో చంద్రగిరిలో బంధువుల శుభకార్యానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గాంధీపురం వద్ద వస్తుండగా తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వెళుతున్న ఆటో రోడ్డుపై భిక్షగాడిని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. భిక్షగాడితో పాటు శివజయంతికి తీవ్రగాయాలయ్యాయి. పవన్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని రుయాకు తరలించారు. ఎస్ఐ మూర్తి కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ


వస్తువులు అందజేస్తున్న లక్ష్మీరెడ్డి

తిరుపతి అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సప్తగిరికాలనీ సచివాలయ ప్రాంగణంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి ఖరీదైన వస్తువులను గురువారం అమరావతి సర్కిల్ ఎస్బీఐ పాన్ ఇండియా సీఎస్ఆర్ ఆక్టివిటీస్ అప్‌గ్రేడింగ్, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి అందించారు. ఇందులో రూ.75వేలు విలువైన ఎల్ఈడీ టీవీ, ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్, వాటర్‌ఫిల్టర్, అవుట్‌డోర్ అండ్ ఇండోర్ ప్లే మెటీరియల్స్, బోధన సామగ్రి వంటివి ఉన్నాయి. ఐసీడీసీ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి, ఎన్.వరలక్ష్మి పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు.

కేశవాయనగుంట చోరీలో దర్యాప్తు ముమ్మరం

● నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేశవాయనగుంటలో చోరీపై క్రైం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గత నెల 20వ తేదీన మున్సిపల్ సిబ్బంది అంటూ దుండగులు ఇంట్లో ఉన్న మహిళ దృష్టి మరల్చి 202 గ్రాముల బంగారు నగలు, రూ.20 వేల నగదు అపహరించుకు వెళ్లిన విషయం తెలిసిందే. నిందితుల కోసం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో డీఎస్పీ రమణకుమార్ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ చోరీ కేసులో నిందితులుగా అనుమానిస్తున్న ముగ్గురు.. తిరుపతి పెద్దకాపులేఔట్‌లోని ఒక లాడ్జిలో కొన్ని రోజులుగా తలదాచుకున్నట్లు కేసు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఆ లాడ్జి వద్దకు వెళ్లి సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. వారి ఫొటోలు, కళ్లు, హెయిర్ స్టైల్ ఆధారంగా నిందితులు కర్ణాటక వారుగా ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. కాగా, ఆ లాడ్జి యజమాని, మేనేజర్‌ను పిలిపించి విచారించినట్లు తెలిసింది. గదులు అద్దెకు తీసుకున్న వారి వివరాలు, ఆధార్ కార్డులు, వారు ఎక్కడ నుంచి.. ఏ పనిమీద వచ్చారనే వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయకుండా ఎలా ఇస్తారని ప్రశ్నించినట్లు సమాచారం. రిసెప్షన్‌లో ఉన్న బాయ్‌కు చదువు రాకపోవడం, వారు తమిళంలో తప్పుడు పేర్లు రాసి గది తీసుకున్నారని వారు చెప్పినట్లు తెలిసింది.


రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా నియమితులైన కరాటే చంద్ర, మధులను కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ టీడీపీ నేత ఊట్ల సురేంద్రతో కలిసి గురువారం కరకంబాడీ టీడీపీ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, రజక సంఘ నేతలు పాల్గొన్నారు.



కొండల నడుమ కోవెల ఒకటున్నది

పండుగ నెల అంటే పచ్చని నెల.
వానాకాలానికి వీడ్కోలు చెప్పేసిన ఆకాశం మరింత నీలిమను పులుముకుంటుంది.
చినుకు చినుకునూ గుండెల్లో పొదుపుకున్న నేల పచ్చని తివాచీ కప్పుకుంటుంది.
తెల్లవారినా తొలగని మంచుతెరలను చూసి సూర్యుడు చిన్నబుచ్చుకుంటాడు. పనిపాటలతో పల్లెలు కళకళలాడుతాయి. వణికించే చలికి పిలకాయలు నెగళ్ల చుట్టూ చేరుతారు. నిద్ర బద్ధకాన్ని కాస్త పక్కకు నెట్టి.. ఉదయాన్నే నగరాన్ని ఏ దిక్కున దాటినా ఈ అందాలను కనుల నింపుకోవచ్చు. రాయలచెరువు, తనపల్లి ప్రాంతాల్లోని ఈ దృశ్యాలను కెమెరాలో చిత్రించి అందిస్తున్నారు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్.

- రామచంద్రాపురం, ఆంధ్రజ్యోతి




మేతకు పోదాం.. ఆకులు తిందాం.. చలో.. చలో!



హబ్బ.. ఏమి చలి సామీ!

అందాల కనువిందు.. పండుగ నెల



తనపల్లి గుట్టమీద నుంచి పరచుకున్న పచ్చదనం



పనికి వేళాయె.. పదపద..

పట్టించుకోండి సారూ..

ప్రమాదకరంగా సిమెంట్ పలకలు



లీలామహల్ నుంచి పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో మురికి కాలువపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. మందుల దుకాణం, పాన్ బ్రోకర్ షాపు, జిరాక్స్ సెంటర్, రాయలసీమ స్కూలు ఉండడంతో ఈ మార్గంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పొరపాటున ఆ పలకలపై కాలు మోపితే గాయాలపాలు కావడం ఖాయం. ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

- తిరుపతి నేరవిభాగం, (ఆంధ్రజ్యోతి)

మధురానగర్‌లో కంపు..కంపు



లీలామహల్ నుంచి దేవేంద్ర థియేటర్‌కు వెళ్లే దారిలోని వినాయక స్వామి ఆలయం వద్ద చెత్తకుప్పలు, చెడిపోయిన చేపల బాక్సులు దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం, కుళ్లిన మాంసం, అన్నం, ఇతర పదార్థాలు నడిరోడ్డుపై పడేసి వెళుతుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ మార్గంలో వెళ్లే వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- తిరుపతి(మధురానగర్) (ఆంధ్రజ్యోతి)



పేరుకున్న చెత్తకుప్పలు

సప్తగిరికాలనీలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఏ వీధిలో చూసినా చెత్తే దర్శనమిస్తోంది. కుక్కలు, పందులు వాటిని తింటూ రోడ్డంతా చల్లుతున్నాయి. ఈగలు, దోమలు పెరుగుతూ స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రెండు రోజులుగా చెత్త తరలించలేదని స్థానికులు చెబుతున్నారు.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)









సీబీఎస్‌లో గుల్లతేలిన పల్లెవెలుగు బస్టాండు

బస్టాండు గుల్లైంది

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండు పూర్తిగా గుల్లతేలిపోయింది. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్టాండులో అప్పుడప్పుడూ మరమ్మతులు చేస్తున్నా నాణ్యత లేని కారణంగా అనతికాలంలోనే లేచిపోతోంది. బ్రహ్మోత్సవాల సమయంలో మరమ్మతులు చేసినా తర్వాత కురిసిన వర్షాలకు మళ్లీ పాడైపోయింది. ప్రధానంగా పల్లెవెలుగు, ఏడుకొండల బస్టాండులు, మూడు నిష్క్రమణ మార్గాలు, ప్రవేశద్వారం, బెంగళూరు, కాణిపాకం ప్లాట్‌ఫామ్స్ ముందు గుంతలు ఏర్పడి గుల్లతేలిపోయింది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు స్పందించాల్సి ఉంది.

అలంకారప్రాయంగా తెలుగుగంగ పైపులు





కరకంబాడీ మెయిన్ రోడ్డులో నేలపాలవుతున్న నీరు - తుడా క్వార్టర్స్ వీధుల్లో నూతన పైపులు

కరకంబాడి రోడ్డు చెన్నాయిగుంట చెరువు వద్ద ఉన్న వాటర్ పంపింగ్ కేంద్రం నుంచి కృష్ణవేణి యాదవ కాలనీలోని తెలుగుగంగ ఫిల్టర్‌హౌస్ వరకు ఉన్న తెలుగుగంగ పైపులు శిథిలావస్థకు చేరుకుని నీరు లీకవుతోంది. పైపుల కాలపరిమితి ముగియడంతో లీకవుతున్నట్లు గుర్తించిన అధికారులు కొత్త పైపులు తెప్పించారేగాని వాటిని బిగించడం మరిచారు. తుడా క్వార్టర్స్ వీధుల్లో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. జయశంకర్‌కాలనీ, తిరుమలనగర్, కరకంబాడీ మెయిన్ రోడ్డు, వీధుల్లో లీకేజీలతో నీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది.

- తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి)

వైద్య పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

తిరుపతి(వైద్యం), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు వైద్య పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం ఆయన జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని రెండు రోజులకు మించి జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. వాటి ఫలితాలను అందించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఐవో శాంతకుమారి, డీపీఎంవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంధులకు పోటీలు

● రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా అంధులకు రీడింగ్, రైటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ (ఎన్ఎఫ్‌బీ) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శనివారం ఎన్ఎఫ్‌బీ ఆధ్వర్యంలో ఎల్ఐసీ రోడ్డులోని ఏపీ ఎన్‌జీవోస్ భవనంలో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంధులకు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి 10 గంటలలోపు పోటీదారులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9966437343, 9949298467లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎన్ఎఫ్‌బీ నేతలు ప్రసాద్ రెడ్డి, పద్మజ పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరవేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేవిధంగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఏపీఎన్‌జీవో తిరుపతి నగర అధ్యక్షుడు సురేష్‌బాబు, కార్యదర్శి బాలాజీ, కోశాధికారి శ్రీనివాసులు, సహ అధ్యక్షుడు రఘు, ఉపాధ్యక్షుడు హిమగిరి రమణ ప్రసాద్, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు పాల్గొన్నారు.

ఇద్దరు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

మూడు దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు సమీపంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్ బృందం బుధవారం అర్ధరాత్రి చంద్రగిరి మండలం భాకరాపేట రేంజ్‌లోని నాగపట్ల బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహించింది. శ్రీవారిమెట్టు సమీపంలో ముగ్గురు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ పోలీసుల కంటపడ్డారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఒకరు తప్పించుకున్నారు. మూడు దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కాలినడకన తిరుమలకు
నటి రాశి సింగ్

ప్రసన్న వదనం, భూతద్దం భాస్కర్ నారాయణ, ప్రేమ్‌కుమార్, పోస్టర్ వంటి చిత్రాల్లో నటించిన నటి రాశి సింగ్ గురువారం కాలినడకన తిరుమలకు వచ్చారు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా ఆమె సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో సినీ హాస్యనటులు

తిరుమల,జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం సినీ హాస్యనటులు సత్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం రాజేష్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం నటుడు శ్రీనివాస్‌రెడ్డి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల పొందేందుకు తిరుమలకు వచ్చామన్నారు. తర్వాత సత్యం రాజేష్ మాట్లాడుతూ తాను నటించిన రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'పొలిమేర' నూతన చిత్రం షూటింగ్ రెండుమూడు నెలల్లో ప్రారంభంకానుందన్నారు. వీరికి చూడటానికి అభిమానులు పోటీపడ్డారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

సత్య, సత్యం రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి →



శ్రీహరి సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.13 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69.630

తలనీలాలు సమర్పించినవారు : 18.965





ఆరోగ్యమే మహా భాగ్యమంటారు. ప్రస్తుత జీవన విధానంలో దీనికి మరింత ప్రాముఖ్యత పెరిగింది. ఆహారం నుంచి జీవనశైలి వరకూ అన్నీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుంగా అనారోగ్యం బారినపడుతున్నారు. యుక్త వయసులో ఉన్నవారూ గుండెపోటుతో కుప్పకూలుతున్న వైనాలు చూస్తున్నాం. మధుమేహం,బీపీ సరేసరి. ప్రతినెలా ఆస్పత్రి లేదా మందుల షాపు చుట్టూ తిరుగుతున్నవారే అధికం. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంలో జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యం దరిచేరదంటున్నారు వైద్య నిపుణులు.

\- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



ఆరోగ్యమే ఆనందం

ఆరోగ్య పరీక్షలు ముఖ్యం

ప్రస్తుతం బీపీ, షుగర్ ఎక్కువ మందిలో కనిపిస్తున్న వ్యాధులు. వీటితోపాటు గుండె, మహిళలకు గైనిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మందిలో షుగర్ వ్యాధి లక్షణాలు కలవరపరుస్తున్నాయి. అందరూ ఆహారంపై శ్రద్ధ పెట్టాలి. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. క్రమం తప్పక ఆరు నెలలకు ఒకసారైనా డాక్టర్ దగ్గరకు వెళ్లి షుగర్, బీపీ, గుండె సంబంధిత సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. గర్భవతులు ప్రతీ నెలా తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వ్యాయామం చేయాలి. అనవసరపు ఒత్తిళ్లకు, ఆలోచనలకు దూరంగా ఉండాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి.


\- డాక్టర్ కృష్ణప్రశాంతి, సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్




ఆహారంతోనే ఆరోగ్యం

ఆరోగ్యం ఆహారంలోనే ఉంటుంది. బయట ఆహారం, జంక్ ఫుడ్స్ తీసుకోవడం వలన వ్యాధుల బారిన పడుతున్నారు. అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ఉత్తమం. పచ్చదనంతో నిండిన కూరగాయాలు చక్కటి ఆరోగ్యాన్ని ఇస్తాయి. పిల్లలకు పానీపూరీలు, చాట్‌లు, బయట హోటళ్లలోని ఫుడ్ పెట్టకూడదు. రంగులు కలిపిన ఆహారాన్ని తినకూడదు. ఇంట్లో చేసిన ఆహారాన్ని మాత్రమే పెట్టడం మేలు. ఇంట్లో చేసుకునే పిండి వంటలు ఆరోగ్యానికి దోహదపడతాయి. మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. పాలు, గుడ్లు, చేపలు వంటి వాటివి ఎక్కువగా తీసుకుంటే మంచిది.

\- ప్రసాద్, డైటీషియన్, రుయాస్పత్రి





అనారోగ్యానికి యోగాతో చెక్

రోజూ యోగా చేస్తే సాధారణ, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడరు. యోగాతోపాటు సులువుగా జీర్ణమయ్యే మిత ఆహారాన్ని, ఎక్కువ శాతం నీటిని తీసుకోవాలి. చిన్నవయసు నుంచే యోగాను అలవాటు చేయడం వలన ఆరోగ్యంగా ఎదుగుతారు. దేవాలయాలకు వెళ్తే అక్కడ మనం చేసే స్వామి వారికి నమస్కారం నుంచి ప్రదక్షిణల వరకు ప్రతీది యోగాలో భాగమే.

\- డాక్టర్ నానబాల జగదేక ప్రతాప్, యోగా నిపుణుడు

పందెం కోళ్లను బరిలోకి దింపేందుకు సై అంటున్నారు కొందరు. మరో పది రోజుల్లో పండుగలు మొదలు కానుండటంతో.. ఇప్పటికే చాలావరకు కోళ్లను జిల్లాకు తీసుకొచ్చారు. వీటికి పౌష్టికాహారం అందిస్తున్నారు. కోళ్ల పందేలపై నిషేధమున్నా.. పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా.. ఎక్కడికక్కడ గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించేందుకు బరులు సిద్ధమవుతున్నాయి.

\- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



పందేనికి సై

కోళ్ల రకం, రంగును బట్టి రూ.2 లక్షల వరకు పలుకుతున్న ధర

సంక్రాంతి సీజన్‌తో పెరిగిన డిమాండ్

సంక్రాంతికి పట్టణాలు, పల్లెలు సిద్ధమవుతున్నాయి. చాటుమాటుగా కోడి పందేల నిర్వహణకూ పలువురు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పలు రకాల కోళ్లకు డిమాండు పెరిగింది. పందేలకు అవసరమైన కోడి పుంజులకు మూడు నెలల నుంచి తమిళనాడు, పలమనేరు, ఊత్తుకోట, చెన్నై, ఏకాంబరకుప్పం, నారాయణవనం వంటి ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు కూడా. కోడి పందేలు ఎక్కడా నిర్వహించకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల నిర్వాహకులు మాత్రం బరులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లాకు దాదాపు 20 వేల వరకు పందెం కోళ్ల కోళ్ల తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. కోళ్ల జాతి రకం, రంగును బట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే తీసుకొచ్చిన ఈ కోళ్లను కొందరు అతిజాగ్రత్తగా చూసుకొంటున్నారు. కోళ్లకు పెరిగిన డిమాండు నేపథ్యంలో కొందరు వీటిని తీసుకొచ్చి విక్రయించడం పనిగా పెట్టుకున్నారు. దీనికి సోషల్ మీడియాను వాడుకుంటున్నట్లు తెలిసింది. తమ వద్దనున్న పందెం కోళ్ల వివరాలను కొందరు ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పెట్టి వాటి వయస్సు, ఎన్ని పందేలు గెలిచిందనే వివరాలను అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నారు. ఈ విధంగా విక్రయించిన వాటిని పార్శిల్ చేయడానికి కూడా ఒక రేటు ఫిక్స్ చేసి బస్సులు, ఆటోలు, వ్యాన్లలో పంపిస్తున్నారు. అక్కడి వారు ఫోన్ ద్వారా సంప్రదించి ఎక్కడకు ఏ సమయానికి కోళ్లు చేరుకుంటాయనేది తెలుసుకుని రిసీవ్ చేసుకుంటున్నారు. ఇలా మొత్తం వ్యవహారం ఆన్‌లైన్ ద్వారానే సాగిపోతోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

డిమాండున్న కోళ్లు

పందెం కోళ్లలో అత్యధికంగా కోడి నెమలి, అబ్రాస్, రసంగి, ఎర్ర డేగ, కక్కెర వంటి రకాలకు మంచి డిమాండ్ ఉంది. సైజు, రంగు, జాతిని బట్టి వీటిని దాదాపు రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

ఆఫర్లతో ఆకర్షణ

కోడి పందేల్లో ఇటీవల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. వరుసగా ఐదు పందేలు నెగ్గితే ద్విచక్ర వాహనం ఇస్తున్నారు. గత ఏడాది వరుసగా పందెం కొట్టి వాహనాలు గెలుచుకున్న వారు ఉన్నారని సమాచారం. ఫలితంగా నిర్వాహకుల మధ్య గట్టి పోటీ ఏర్పడింది.

నాదనీరాజనం కార్యక్రమాల వేళల మార్పు



నాదనీరాజనం వేదికపై మీనాక్షి సోమసుందరం బృందం వీణవాయిద్య కచేరి

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సంగీత, నృత్య కార్యక్రమాల సమయాన్ని టీటీడీ మార్చింది. గతంలో ఈవేదికపై కార్యక్రమాలన్నీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగేవి. పారాయణాల పేరుతో వీటిని మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. ఈ సమయం కళాకారులకు ఇబ్బందిగా మారడంతో పాటు భక్తులెవ్వరు ఉండటంలేదరు. ఫలితంగా ప్రోత్సాహం కరువైంది. ఈ విషయాలను ఇటీవల 'కళతప్పిన నాదనీరాజనం' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి పాత విధానంలో సాయంత్రం 6 నుంచి 7 గంటలకు కార్యక్రమాల నిర్వహణను మార్చారు. గురువారం సాయంత్రం తమిళనాడుకు చెందిన మీనాక్షి సోమసుందరం బృందం నాదనీరాజనం వేదికపై వీణ వాయిద్య కచేరి భక్తులను ఆకట్టుకుంది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

కేజీబీవీ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'టీచింగ్ అనేది వృత్తి కాదని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకత్వం చేసే బాధ్యత' అని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడలోని లయోలా కాలేజీలో ఆయన ప్రారంభించారు. కేజీబీవీ టీచర్లు బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని, బాలికలకు భద్రత, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ శిక్షణా సదస్సు నుంచి మెరుగైన బోధనా విధానాలు నేర్చుకుని, కేజీబీవీల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

షార్ ఎంఎస్ఏ డీడీగా గోపీకృష్ణ

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏరియా (ఎంఎస్ఏ) డీడీగా గోపికృష్ణ నియమితులయ్యారు. ఎంఎస్ఏ గ్రూపు డైరెక్టర్ ఉన్న ఈయన్ను పదోన్నతిపై డీడీగా నియమించారు. అదేవిధంగా షార్‌లో సాలిడ్ మోటారు ప్రిపరేషన్, ఎన్విరాన్‌మెంటల్ టెస్టింగ్ ఫెసిలిటీ (ఎస్ఎంటీ ఈటీఎఫ్) డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శంకరన్‌ను వాల్ఫ్ (వీఏఎల్ఎఫ్) డీడీగా నియమించారు. ఈ మేరకు బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. వీరు మరో నాలుగు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

నేదురుమల్లి సహా వైసీపీ నేతలపై కేసు నమోదు

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, జనవరి 2: (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో గత నెల 27వ తేదీన వైసీపీ నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో తనపై కొంతమంది ఆ పార్టీ నాయకులు దౌర్జన్యం చేశారంటూ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సీసీ నాయుడు గత నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంకటగిరి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో పాటు ఆ పార్టీకి చెందిన అల్లం సాయి, అల్లం సుబ్బు, ఏవీ నాగార్జున, నర్రావుల వేణుగోపాల్ నాయుడు, చింతల శ్రీనివాసులు రెడ్డి, ముప్పాళ్ల మునికృష్ణ, ఎం.శ్రీనివాసులు, మస్తాన్ రెడ్డి, నాగేంద్ర, కోమల వెంకటయ్య, బత్తల సాయిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, తమపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ కేసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

• 1200 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు పూర్తి

నేడు నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా



జాబ్ మేళాలో అభ్యర్థుల కోసం కుర్చీల ఏర్పాటు

చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందులో 1200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా 1800 మంది దరఖాస్తు చేసుకొన్నట్లు అధికారులు తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా కూడా నిరుద్యోగులు వచ్చే అవకాశాలు ఉందన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో జాబ్‌మేళా జరుగుతుంది. ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో డీపీవో సుశీలాదేవి పర్యవేక్షణలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం ఏర్పాట్లు చేశారు. 20 కౌంటర్లలో అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగళూరులకు చెందిన ఐటీ, బీపీవో కంపెనీలు, శ్రీసిటీ, గాజుమడ్యం, రేణిగుంట ఈఎంసీ, నాయుడుపేట ఎస్ఈజడ్ నుంచి పరిశ్రమల మొత్తం 20 కంపెనీల ప్రతినిధులు రానున్నారు. మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అనుకున్న లక్ష్యాన్ని దాటి అదనంగా 500 మందిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు వారు చెప్పారు.

మద్యం తాగి తిరుమలకు వచ్చిన
ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్



తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలకు మద్యం సేవించిన వచ్చిన ఇద్దరు డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూయర్ సందర్భంగా ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, సిబ్బంది బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అతివేగంగా వస్తున్న రెండు వాహనాలను నిలిపి డ్రైవర్లు శేఖర్, శంకర్‌ను బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీ చేశారు. వారు మద్యం తాగి వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహనాలను తిరుమలకు శాశ్వతంగా రాకుండా సీజ్ చేశారు. మద్యం తాగి తిరుమలకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందింది. తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమార్ ఈ విరాళాన్ని అందజేశారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చెక్‌ను అందజేసి ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

← కుటుంబ సభ్యులతో విరాళాన్ని అందజేస్తున్న గిరిధర్

గో ఆధార్ మజల్స్ యాప్ ప్రారంభం



చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో గురువారం 'గో ఆధార్ మజల్స్' యాప్‌ను జిల్లా పశుసంవర్ధనశాఖాధికారి డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా మజుల్స్‌ను క్యాప్చర్ చేసి, అందులో పశువుల యజమాని పేరు, ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్లను నమోదు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాడి రైతులు తమ పశువులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీడీ డాక్టర్ ఉమామహేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 329 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు గురువారం 329 అర్జీలు అందాయి. 49 గ్రామసభల్లో వచ్చిన ఈ అర్జీల్లో ఇంటి స్థలాలపై 19, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 8, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 5, క్యాస్ట్ వెరిఫికేషన్ 2, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 1, ఆర్‌వోఆర్‌పై 158, ఇతర విషయాలకు సంబంధించి 99 ఉన్నాయి. అందులో 155 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన వాటిని నిర్ణీత కాల పరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

ఏర్పేడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం శ్రీకాళహస్తి డీఎల్‌పీవో ప్రభురెడ్డి పరిశీలించారు. రోజువారీ చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రమణకుమార్, సర్పంచ్ రుక్మిణి, మాజీ సర్పంచ్ మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సాధనపై దృష్టి సారించండి

రేణిగుంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదుతున్న విద్యార్థుల అభ్యసన సాధనపై పాఠశాల యాజమాన్యం కమిటీ దృష్టి సారించాలని ఎంఈవోలు ఇంద్రదేవి, రంగనాథయ్య సూచించారు. స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాల కమిటీకి గురువారం ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించాలని, పాఠశాలల పరిసరాలలో శుభ్రత పాటించాలని, బడికి రాని పిల్లలను పాఠశాలకు పంపేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణా తరగతుల పరిశీలకులు హేమమాలిని, మండలానికి చెందిన 66 కమిటీల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురం ఎమ్మార్సీలో మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో బాబయ్య రిసోర్స్‌పర్సన్‌లు రమేష్‌బాబు, గిరిబాబు, మురళి, అబ్జర్వర్ వెంకటేశులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



కేవీబీపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ కేసు నమోదుపై డీఎస్పీ విచారణ చేపట్టారు. మండలంలోని కళత్తూరు గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 173/1, 2, 3, 4నెంబర్లలో 8.50ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని మొదట గోవిందరాజు అనే వ్యక్తి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అదే భూమిని మండ లానికి చెందిన అరె గ్రామస్థుడు ప్రకాష్‌నాయుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. దీనిపై పదేళ్లుగా గోవిందరాజు, ప్రకాష్ నాయుడుకు మధ్య వివాదం నెలకొంది. దీంతో ప్రకాష్‌నాయుడు హైకోర్టును ఆశ్రయించడంతో అతనికి అనుకూలంగా తీర్పు వెలువడింది. ఈ క్రమంలో ప్రకాష్‌నాయుడు కళత్తూరు గ్రామానికి చెందిన ఎస్సీ కులానికి చెందిన చంద్రశేఖర్‌కు ఆ భూమిని లీజుకు ఇచ్చాడు. చంద్రశేఖర్ ఆ భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఆరునెలల క్రితం విషయం తెలుసుకున్న గోవిందరాజులు పొలం వద్దకు వెళ్లి చంద్రశేఖర్‌ను దూషించాడు. బాధితుడు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్రితం కేసు నమోదైంది. కేసు విచారణలో ఉంది. దీనిపై విచారణ జరపాలని కోర్టు ఆదేశించడంతో గురువారం డీఎస్పీ రవికుమార్ బాధితుడైన చంద్రశేఖర్‌తో మాట్లాడారు.

రైలు దిగుతూ అదుపుతప్పి ఒకరిమృతి



బాలాజీ (ఫైల్)

సత్యవేడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపంలోని కవరపేట్టై రైల్వేస్టేషన్‌లో నడుస్తున్న రైలు దిగుతూ అదుపుతప్పి సత్యవేడుకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన బాలాజీ (46) స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఫ్యాన్సీస్టోర్ నిర్వహిస్తున్నాడు. ఒక పని నిమిత్తం బాలాజీ రెండు రోజుల క్రితం విజయవాడకు వెళ్లారు. పనులు పూర్తి చేసుకుని సత్యవేడుకు వచ్చేందుకు చెన్నై రైలు ఎక్కాడు. చెన్నై సెంట్రల్ స్టేషన్‌లోనే స్టాపింగ్ ఉంది. అయితే కవరపేట్టై రైల్వే స్టేషన్ వద్ద రైలు వేగం తగ్గింది. దీంతో బాలాజీ అక్కడ దిగేశాడు. అదుపు తప్పి ప్లాట్‌ఫామ్‌కు రైలు మధ్యలోకి చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరకు కుమార్తెలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దారు మునిరత్నంరెడ్డి

కేవీబీపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు, కర్లపూడి పంచా యతీల ప్రజల కోసం రెవెన్యూ సదస్సును కోవనూరులో గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో ఎక్కువగా సర్వే నెంబరు 164, 262, 155, 157 తదితర నెంబర్లలో ఉన్న భూములు హరిజనులకు ఇచ్చా రని వాటిని ఇతరులు ఆక్రమించి అమ్ముకున్నారని ఎస్టీలు తహసీల్దార్ ముని రత్నంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, ఆయకట్టు చైర్మన్ వెంకటమునిరెడ్డి, వివేక్ రెడ్డి, సర్పంచులు పెంచులయ్య, సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక, టిప్పర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

రేణిగుంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను గాజులమండ్యం పోలీసులు అడుసుపాళెం జగనన్న లేఔట్ వద్ద గురువారం రాత్రి పట్టుకున్నారు. అలాగే ఇదే ప్రాంతంలో నిల్వచేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. పట్టుకున్న వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

దాభాలు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోటలో గురువారం ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు జరిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్‌సేఫ్టీ అధికారిణి నర్మదలు పలు మార్టులు, హోటళ్ల, దాభాలలో ఉన్న వంటకాలు, ఫలహారాలను పరిశీలించారు. కొన్ని శాంపిళ్లను వెంట తీసుకెళ్లారు. ఈ బృందం వెంట స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత ఉన్నారు.

అత్యాచారయత్నం ఘటనలో నిందితుడి అరెస్టు

తడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. తడ మండలానికి చెందిన 57 ఏళ్ల దివ్యాంగ వృద్ధురాలిపై తడకండ్రిగ గ్రామానికి చెందిన మొలవాయిల్ కుమార్ గత మంగళవారం అత్యాచారయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. దానిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గురువారం తడలో అరెస్టు చేశారు. నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చిట్టమూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి గ్రామానికి చెందిన హేమ ఇంటిలో బుధవారం చోరీ జరిగినట్లు చిట్టమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కనుపూరుకు దైవదర్శనానికి వెళ్లిన హేమ కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళాలు తీసేసి ఉన్నట్లు గమనించారు. ఇంట్లోకెళ్లి పరిశీలించగా 5 సవర్ల బంగారం కన్పించలేదని బాధితులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పోలీస్ స్టేషన్‌లో గురువారం నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు రికార్డులను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, ఆహార పొట్లాల పంపిణీ



దుస్తులు, ఆహార పొట్లాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో గురువారం సేవాసంస్థ ఆధ్వర్యంలో భాస్కరరావు సహకారంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళీ నాయుడు, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్ బాబు, హెచ్ఎం నాగరాజు

డక్కిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, రిసోర్సుపర్సన్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాకమిటీ చైర్మన్, సభ్యులతో కలసి పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం నాగరాజు, తగ్గవోలు హెచ్ఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును కమ్మేసిన పొగమంచు



వివేకానందరోడ్డులో, రైల్వేస్టేషన్‌లో కమ్మేసిన పొగమంచు

గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణాన్ని గురువారం ఉదయం పొగమంచు కమ్మేసింది. స్థానిక రైల్వేస్టేషన్, వివేకానందరోడ్డు, ఆసుపత్రిరోడ్డు, స్టేడియం, జాతీయ రహదారి, పొలాలు తదితర ప్రాంతాల్లో పొగమంచు కురిసింది. దీంతో వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పొగమంచు ఆహ్లాదకరంగా ఉండటంతో ప్రజలు ఆస్వాదించారు.

శిథిలావస్థకు చేరిన బ్రిటీష్ కాలంనాటి వంతెన

- కాలంగి నదిపై ప్రమాదకరంగా ప్రయాణం
- 20 ఏళ్లుగా ప్రతిపాదనలతోనే సరి...



శిథిలావస్థకు చేరిన కాళంగి వంతెన

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రధాన రహదారి జీఎన్‌టీ రోడ్డులో చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 2004 నుంచి పలుసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. వంతెన కింద భాగం అక్కడక్కడ పగుళ్లు వచ్చాయి. ఈ రోడ్డు సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో వేలాది వాహనాలు వెళ్తున్నాయి. దీనికి తోడు సూళ్లూరుపేట పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఇక్కడ నుంచి శ్రీసిటీ, అపాచి, మేనకూరు ప్రాంతాలకు వందలాది వాహనాలు వెళ్తున్నాయి. దీంతో భారీ వాహనాలు కూడా వంతెనపై నుంచి వెళుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. డిసెంబరులో వచ్చిన వరుస తుపాన్‌లకు వంతెన కింద గుండా వెళ్లే నీటి పారుదలకు మరింత బలహీనపడింది. ఈ వంతెన స్థానంలో మరో వంతెన నిర్మించాలని 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం రూ.3 కోట్లు నిధులు మంజూరైనట్లు ప్రకటించారే తప్ప ఆచరణకు నోచుకోలేదు. 2017లో ఆర్అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపినా కదలికలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకోకుండా 2023 నవంబరులో అప్పటి సీఎం జగన్ తడ మండల పర్యటన నేపథ్యంలో రూ.35 కోట్లతో కాళంగి నది వంతెన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా సీఎం పర్యటన రద్దయ్యింది. మళ్లీ కాళంగి వంతెన కథ మొదటికి వచ్చింది. ఇటీవల వర్షాల సమయంలో వంతెన బాగా బలహీనపడటంతో పోలీసులు భారీ వాహనాలు, కంపెనీలకు వెళ్లే బస్సులు వంతెనపై వెళ్లకుండా ఆదేశాలు జారీ చేశారు. కాని కంపెనీలకు వెళ్లే బస్సులు, భారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. 2007లో ఈ వంతెన ఓ వైపు కూలి ప్రమాదస్థాయికి చేరడంతో దాదాపు ఆరు నెలల పాటు రాకపోకలు నిలిపివేశారు. అనంతరం తాత్కాలికంగా మరమ్మతులుచేసి వాహన రాకపోకలు పునఃప్రారంభించారు. ప్రధాన రహదారిపై కాళంగి వంతెన శిథిలావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కాళంగి వంతెనపై వెళ్తున్న వాహనాలు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన శారీరక దారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో మెలగాలని చెప్పారు. విద్యార్థినులు కూడా ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గూడూరు పాలిటెక్నిక్ కళాశాలలోని మైనింగ్ విభాగం దేశస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రవికృష్ణ, విజయ్‌కుమార్, నిర్మల్‌కుమార్, వెంకటేశ్వర్లు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వెంకటేష్, ఇశ్రాయిల్‌కుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వైసీపీ పాలనలో అవినీతిపై విచారణ ఏది?

- నిలదీసిన రాజకీయ పక్షాలు
- గందరగోళంగా గ్రామసభ

రేణిగుంట, జనవరి 2(ఆంధ్ర జ్యోతి): గత వైసీపీ పాలనలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణలో జరుగుతున్న జాప్యంపై రాజకీయ పక్షాల నాయకులు నిలదీశారు. అభివృద్ధి చేయకనే చేసినట్లు చూపి నిధులు స్వాహా చేసినా ఎందుకు ఉపేక్షిస్తున్నారనంటూ జనసేన, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు ధ్వజమెత్తారు. ఆ మేరకు సర్పంచ్ నాగేశం, కార్యదర్శి మణిని నిలదీయడంతో రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన గ్రామసభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి లక్షల్లో బిల్లులు పెట్టుకుని స్వాహ చేసిన వైనంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. సుబ్బరాజు బోరు స్థలం విషయంలో న్యాయస్థానానికి వెళ్లేందుకు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. పంచాయతీకి చెందిన బస్టాండు దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంతలో అధిక మొత్తంలో వసూలు చేయడాన్ని తప్పుబట్టారు. పంచాయతీలో వేలంపాట నిర్వహించకపోవడాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో రోడ్లు మొత్తం గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్రఇబ్బందికరంగా మారినా పట్టించుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. గ్రామసభలో లేవనెత్తిన సమస్యలను రికార్డు బుక్‌లో నమోదు చేసి గ్రామస్థుల చేత సంతకాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మణి మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవినీతిపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపడుతామని తెలిపారు. తాను కొత్తగా ఇక్కడ బాధ్యతలు చేపట్టానని, గత విషయాలు తనకు తెలియవని, ఉన్నతాధికారులదృష్టికి సమస్యను తీసుకెళతానని చెప్పారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.



సర్పంచ్‌ను నిలదీస్తున్న రాజకీయ పక్షాలు, గ్రామస్తులు

ఇద్దరు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

మంగళం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు సమీపంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్‌ఐ టి.విష్ణువర్ధన్ బృందం బుధవారం అర్ధరాత్రి చంద్రగిరి మండలం భాకరాపేట రేంజ్‌లోని నాగపట్ల బీట్ పరిధిలో కూంబింగ్ నిర్వహించింది. శ్రీవారిమెట్టు సమీపంలో ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఒకరు తప్పించుకున్నారు. దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి నిర్మాణ సమస్యలు పరిష్కరించండి



రెవెన్యూ కార్యాలయంలో సమీక్ష

పుత్తూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించాల్సిన ఆలయాలకు సంబంధించి పాలక మండళ్లతో, ఆయా గ్రామస్తులతో మాట్లాడి త్వరగా సమస్య పరిష్కరించాలని జాతీయ రహదారి ప్రాజెక్టు మేనేజరు రాజారావు రెవెన్యూ అధికారులను కోరారు. దీంట్లో భాగంగా గురువారం రెవిన్యూ కార్యాలయంలో చెన్నై - తిరుపతి జాతీయ రహదారి పనుల నిర్వహణపై తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో చర్చించారు. మండలంలోని రహదారుల వెంట వున్న ఆలయాల తొలగింపుపై చర్చ జరిగింది. రికార్డుల ప్రకారం కైలాసపురం వద్ద అష్టలక్ష్మి, కాళీమాత, పరమేశ్వరమంగళం వద్ద వినాయకస్వామి, నాగాలమ్మ, ఉత్తరపుకండ్రిగ వద్ద అమ్మవారి ఆలయాలకు సంబంధించి గతంలోనే ఆయా ఆలయ చైర్మన్లకు నష్టపరిహారం అందించామని మేనేజర్ తెలిపారు. కొందరు అంగీకరించడం లేదని ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో సంప్రదించాలని తహసీల్దార్ తెలియజేశారు. అలాగే గతంలో భూసేకరణ అధికారులు పొరబాటున నష్టపరిహారాన్ని ఒకరి పేరుమీదనే పంపిణీ చేయడంతో సమస్యలు ఏర్పడ్డాయని వీటిని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కైలాసపురం, పరమేశ్వరమంగళం గ్రామ ప్రాంతాలను తహసీల్దారు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీ అశోక్‌రెడ్డి, మండల సర్వేయరు శేషమరాజు, ఆర్ఐ తిరుమలసాయి, ఆయా గ్రామ వీఆర్‌వోలు, గ్రామపెద్దలు బాలాజీ, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

అప్పట్లో ఆగిన పనులు ఇవే..!

చెన్నై - తిరుపతి జాతీయ రహదారి పనులు 15 ఏళ్ల క్రితం మొదలయ్యాయి. ఈ పనులు రేణిగుంట నుంచి పుత్తూరు వరకు పూర్తిచేశారు. తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయాయి. పుత్తూరు నుంచి తమిళనాడు సరిహద్దు అయిన తడుకుపేట వరకు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ప్రస్తుతం మళ్లీ పనులు కొనసాగుతున్నాయి.

పుత్తూరు వార్తలు

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభం

పుత్తూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ లోకనాథం, నాంది ఫౌండేషన్ శిక్షకులు శరత్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తమరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు స్థలం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్

వడమాలపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఆర్ పురంలో ఇటీవల డంపింగ్ యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పరిశీలించారు. రికార్డులను పరిశీలిం చారు. అనంతరం గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న గూలూరు చెరువు తూములను పరిశీలించారు. సమస్యలపై కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. ఇదిలా శ్మశాన స్థలం కేటాయించాలని పాత ఎస్టీ కాలనీ వాసులు కోరారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జరీనా, డీటీ సుధీర్, ఆర్.ఐ.జానీబాష, సర్పంచ్ మణిరాజు ఉన్నారు.

ఎస్టీపీ నిర్మాణంలో తీవ్ర జాప్యం..?

- రూ.13.37 కోట్లు మంజూరు
- మూడు ప్రాంతాల్లో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- 6.76 ఎకరాల భూమి.. భూసేకరణ దశలో నిలిచిన వైనం
- పుత్తూరు మున్సిపల్ పరిధిలో భూగర్భ జలాలు కలుషితం



పుత్తూరులో ఎస్టీపీ కోసం అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్ (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా తయారైంది.. పుత్తూరు మున్సిపల్, రెవెన్యూ అధికారుల పనితీరు. మురుగునీటి శుద్ధి కర్మాగారం(ఎస్టీపీ) నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొంది. పుత్తూరు మున్సిపాలిటీలో 54.92 లక్షల మంది జనాభా ఉన్నారు. సింక్‌లు, స్నానాలు, వాషింగ్ మెషీన్లు, మరుగుదొడ్లు, ఇతర గృహోపకరణాల నుంచి వచ్చే మురుగునీరు చెరువుల్లోకి చేరుతోంది. దీంతో చెరువులతో పాటు భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయి.

ఆలస్యం చేస్తే..?

మురుగునీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు రూ.13.37 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. స్థానికంగా గోవిందపాళెం, నేసనూరు, పుత్తూరు ప్రాంతాల్లో ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ మూడు ప్రాంతాల్లో 6.76 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. సర్వే, భూ బాధితులతో చర్చలు చేపట్టి రెండు నెలలు గడుస్తోంది. తిరుపతి ఆర్డీవో సైతం భూసేకరణ భూములను పరిశీలించారు. భూముల రిజిస్ట్రేషన్ విలువలు, భూ బాధితుల వివరాలను నివేదిక రూపంలో జేసీకి అంజేశారు. కానీ భూ పరిహారం నిర్దేశం వంటివి కొలిక్కిరావాల్సి ఉంది. మరో రెండు నెలలు జాప్యం జరిగితే ఆర్థిక సంవత్సరం ముగింపుతో కేటాయించిన నిధుల వెనక్కు వెళ్లే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ఎర్యావరణ పరిరక్షణకు, మెరుగైన ప్రజారోగ్యం కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మురుగునీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు తీసుకున్న చొరవ అధికారుల జాప్యంతో నీరుగారే పరిస్థితి నెలకొంది.

పర్యావరణ హితం

మురుగునీటి శుద్ధి కర్మాగారాలు ఏర్పాటైతే మూడు అంచెలలో శుద్ధి చేసిన మురుగునీటిని చివరిగా క్లోరినేషన్ చేసి బయటకు వదులుతారు. ఈ నీటిని వ్యవసాయానికి, ఆక్వా కల్చర్‌కు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. మురుగునీరు శుద్ధి చేయగా వచ్చే వ్యర్థ పదార్థాలను రైతులు పొలాలకు సైతం వినియోగించుకోవచ్చు. ఇంతటి ప్రజా సౌలభ్యం, పర్యావరణ హితం కోసం చేపట్టాల్సిన మురుగునీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


సదస్సులో పాల్గొన్న జేసీ శుభం బన్సల్

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు, అధికారులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు. ● శ్రీకాళహస్తి మండలంలోని ఎగువవీధిలో రెవన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

చెక్‌డ్యాం నిర్మించండి : రైతుల వినతి



సత్యవేడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర - తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు సమీ పంలో బాలక్రిష్ణాపురం చెరువు వద్ద చెక్ డ్యాం నిర్మించి సాగునీటి వృథాను అరికట్టాలని రైతులు కోరారు. బాలక్రిష్ణాపురంలో గురువారం తహసీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వ ర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో పలువురు వివిధ సమస్యలపై వినతులను అందిం చారు. బాలక్రిష్ణాపురం, కాదిరివేడు గ్రామాలలో పొలాలకు వెళ్లే దారిలో మడుగు వద్ద వం తెన నిర్మించాలని సర్పంచ్ ఇందుమతి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా శ్మశానవాటికకు వెళ్లే దారికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆర్‌ఐ సురేష్, వీఆర్వో మోహన్‌రాజ్, పంచాయతీ సెక్రటరీ సునీల్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సందీప్ పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



వరదయ్యపాళెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింపాళెంలో గురువారం ముస్లింపాళెం, గౌసియానగర్, సీఎల్‌ఎస్‌పల్లి, రాజీవ్‌నగర్‌లో ఉండే సుమారు 130 కుటుంబాలలకు ఎన్‌ఆర్‌ఐ షేక్ బాబు నూరుద్దీన్ ఆర్థిక సహకారంతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వీటిని షేక్ అబ్దుల్ పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ విద్యార్థులకు విద్యాపరంగా ఆర్థిక ఇబ్బందులుంటే జమాత్ కమిటీ సభ్యులకు తెలియజేస్తే తమ వంతు సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రసూల్‌సాహెబ్, చాంద్‌బాషా, హఫీజ్, ఫారుక్, షహీద్, ఫిరోజ్‌ఖాన్, ఆటో అబూబకర్, జంషేర్ అలీ, బర్కత్, ఇమ్రాన్, సద్దాం, రమేష్, గణి, అఫ్రీద్ పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి


రోశమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం/పిచ్చాటూరు/నారాయణవనం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం ముస్లింపాళెం పంచా యతీ లక్ష్మీపుర గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నూతలపాటి కన్నయ్యనాయుడు, పిచ్చాటూరు మండలం రాజా నగరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రవి మాతృమూర్తి రోశమ్మ, నారాయణవనం మండలం నారాయణవనం పంచాయితీ ఉప సర్పంచ్‌గా సేవలందించిన తులసీముని (90) గురువారం మృతిచెందారు. ఎమ్మెల్యే ఆదిమూలం వారి మృతదేహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనపాటు ఆయా మండలాల నాయకులు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తదితరులు అంజల ఘటించారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న డీవైఈవో ప్రభాకర్‌రాజు

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేద్దామని పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పీడీలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వ్యక్తిగత, ఉపాధ్యాయ, గ్రూప్ విభాగాల కింద ప్రతి మండలం ఉంచి మూడు ఎగ్జిబిట్లు జిల్లా ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ముందుగా కమిటీలు వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచివచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేద్దాం



శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 5వ తేదీ జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేద్దామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన త్యాగరాజు



వరదయ్యపాళెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని గురువారం వరదయ్యపాళెంకు చెందిన ఆ పార్టీ నాయకుడు గుత్తి త్యాగరాజు విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. పలు కార్పొరేషన్లలో దేవాంగులకు సముచిత స్థానం కల్పించేలా చూడాలని విన్నవించారు.

సిపాయి భరోసా పంపిణీ

ఏర్పేడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పాతగుంట సాంబ శివారెడ్డి మరణించారు. గురువారం ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం పరామర్శించారు. వారికి సిపాయి భరోసా కింద నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణం ప్రారంభం

పిచ్చాటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికుంద్రం, వెంగళత్తూరు, పిళ్లారికండ్రిగ గ్రామాల్లో 14.5 లక్షల ఉపాధి నిధులతో 450 మీటర్లు సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈ తేజ, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కె.రామచంద్ర రాజు, అడవి శంకరాపురం ఆయకట్టు చైర్మన్ పద్దురాజు, సర్పంచ్ దిలీప్, వెంగళత్తూరు శింభు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు


కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి పట్టణ వ్యాప్తంగా పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 35 మంది పట్టుబడ్డారు. వారి వాహనాలను సీజ్‌చేసి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ గోపి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు జీతాలివ్వండి : ఏఐటీయూసీ


ధర్నా చేస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

పిచ్చాటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు పండగ పూటైనా జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకుడు చిన్నారాజ్ కోరారు. పంచాయతీ కార్మికులకు జీతాలివ్వాలని గురువారం పిచ్చాటూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్స్, యూనిఫాం ఇవ్వాలని సర్పంచ్ అన్నాదొరై కోరారు. అనంతరం ఎంపీడీవో మహ్మద్‌రఫికి వినతిపత్రం అంద జేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మునిచంద్ర, గోవిందయ్య, లోకయ్య, సరళ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించండి

● ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో కొత్త ఒరవడిని ఉపాధ్యాయులు తీసుకురావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని కారణి మిట్ట ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం ద్వారా రూ .15వేలు ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, జిల్లా గ్రంథా లయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు మధు నాయుడు, కార్తిక్ నాయుడు, రవినాయుడు, మునిచంద్రనాయుడు, వీరరాఘవులు, రామనాథం, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


వరదయ్యపాళెంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దారు రాజశేఖర్ అన్నారు. వరదయ్యపాళెంలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావు కాలనీకి చెందిన ప్రజలు శ్మశాన స్థలం కేటాయించాలని కోరారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పవన్‌కుమార్ మాట్లాడుతూ వరదయ్యపాళెం పంచాయతీలో భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ

పిచ్చాటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులో సీపీఐ శత వార్షికోత్సవంలో భాగంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజు, సుభాష్, అన్నాదొరై, గోవిందయ్య, ఏఐటీయూసీ నాయకులు శరవణ్, అయ్యప్ప పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై పరిశీలన

వరదయ్యపాళెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం నుంచి చిన్నపాండూరు, వరదయ్యపాళెం -తడ రోడ్డు మార్గాలు అధ్వానంగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చెన్నావారిపాళెంకు చెందిన టీడీపీ నాయకుడు ఎన్టీఆర్ వెంకయ్య పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు డీఈ రాంబాబు, ఏఈ దుర్గేష్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళి గురువారం రోడ్ల దుస్థితిని పరిశీలించారు. త్వరలోనే మరమ్మతులు పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు రశీదులు ఇవ్వడం లేదు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లివెట్టు గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీలకు అధికారులు రశీదులు ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. కొన్ని అర్జీలకు మాత్రమే ఇచ్చి పలువురికి ఇవ్వలేదని పేర్కొన్నారు. కాగా రెవ్వెన్యూ సదస్సులో 26 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, ఆర్‌ఐ నల్లయ్య, సర్వేయరు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని యోగా గురువు సురేష్ నాయుడు తెలిపారు. మండలంలోని చిన్నపాలేడు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వినియోగించరాదని సూచించారు.

గ్రామసభల ద్వారానే పనులు గుర్తించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలలో చేపట్టే పనులు గ్రామసభల ద్వారానే గుర్తించాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. బీఎన్‌కండ్రిగ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ సర్పంచ్ వెంకటమ్మ అధ్యక్షతన జరిగింది. తాగునీరు, పారి శుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండలంలోని పలు పంచాయతీలలో గ్రామసభలు జరిగాయి. కార్యదర్శి సుబ్ర మణ్యం, ఉప సర్పంచ్ మునిరాజా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

కేవీబీపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తకాలనీలో సర్వే నెంబరు 53లో పేదలకు ఇంటిస్థలాలు కేటాయించారు. ఈ స్థలాల విషయంలో కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో ఆ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని కోర్టు స్టే ఇచ్చింది. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను సైతం నాటారు. అయితే కొంతమంది కాంట్రాక్టర్లు అక్కడ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో రోడ్డు నిర్మాణాలు చేపట్టవద్దని గ్రామ సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ అయ్యప్ప కాంట్రాక్టర్లను కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో వారు గురువారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు ప్రస్తుతానికి పనులు ఆపాలని ఆదేశించారు.

అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భవానీ దీక్ష భక్తులకు అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు కేటాయిస్తున్నట్లు డిపో మేనేజరు బాలాజీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రేపు ముగ్గుల పోటీలు

శ్రీకాళహస్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు కోలా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం రాజగోపురం వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9848420201, 9291226699 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు ముగ్గురికి గాయాలు

రేణిగుంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ద్విచక్ర వాహనంలోని ముగ్గురు గాయపడ్డారు. శ్రీకాళహస్తికి చెందిన బత్తెయ్య డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధ వారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భార్య శ్రావణి, కుమార్తె హేమశ్రీతో కలిసి ద్విచక్ర వాహనంలో తిరుపతిలోని కపిలతీర్థానికి బయలుదేరాడు. మల్లవరం గ్రామ సమీపంలో వారి వాహనాన్ని వెనుక నుంచి ఓ కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో చిన్నారి హేమశ్రీ పరిస్థితి విషయంగా మారింది. శ్రావణికి నడుము ఎముకలు విరిగాయి. అర్బన్ పోలీసులకు బత్తెయ్య గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశారు.